క్లుప్తంగా

ఘనంగా గౌరీ నీలకంఠేశ్వర స్వామి వార్షికోత్సవం



స్వామివారికి కల్యాణ నిర్వహిస్తున్న వేద పండితులు

మీర్‌పేట: మీర్‌పేట శివసాయినగర్ కాలనీలోని గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమత లక్ష్మీగణపతి దేవాలయ 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వార్షికోత్సవం చివరి రోజు బుధవారం స్వామివారికి సిద్ధి బుద్ధి గణపతి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ, కాలనీలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ సుభాష్‌రెడ్డి, సభ్యులు నటరాజ్, అజిత్‌రెడ్డి, సుజిత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, అన్నాజీరావు, రామచంద్రారెడ్డి, బలరామకృష్ణ పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణ ప్రారంభం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న పారిజాత

బడంగ్‌పేట్: మొబైల్, టీవీ, కంప్యూటర్ల నుంచి విద్యార్థులను కాపాడడానికి బాలల వ్యక్తిత్వ వికాస యోగా శిక్షణా తరగతులను బడంగ్‌పేట్‌లోని లోటస్ ల్యాప్ స్కూల్‌లో ప్రారంభించారు. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను మేయర్ చిగురింత పారిజాత చేతులమీదుగా బుధవారం ఆవిష్కరించారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇస్తామని ఇస్మాయిల్ గురూజీ తెలిపారు. ధ్యానం, ప్రాణాయామాలు, సూర్య నమస్కారాలు విద్యార్థులకు నేర్పించడంతో చెడు అలవాట్లకు విద్యార్థులు దూరం అవుతారన్నారు. ఇతర వివరాలకు 9603256572 నెంబరును సంప్రదించవచ్చన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



హోమం చేస్తున్న జెడ్పీటీసీ దంపతులు, తదితరులు

తలకొండపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య ఆలయంలో గణపతి పూజ, మూలమంత్రం, జపములు, అంకురార్పణ, జలధివాసం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యజ్ఞహోమాలు నిర్వహించారు. జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ దంపతులు యజ్ఞహోమాల వద్ద కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గురువారం ఉ.11 గంటలకు స్వామి కల్యాణం జరుగుతుందని జెడ్పీటీసీ వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.

వార్షికోత్సవానికి రండి



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రామస్తులు

మాడ్గుల: మండలంలోని అందుగుల గ్రామంలో జూన్1న జరిగే అభయ ఆంజనేయస్వామి ప్రథమ వార్షికోత్సవం, బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకకు రావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని గ్రామస్తులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మాడ్గుల మండల సింగిల్ విండో డైరెక్టర్ కొప్పు జగన్, మాజీ రైతు సమన్వయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, దేవస్థాన కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపినాయక్, గ్రామస్తులు ఉన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి కల్యాణం



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

యాచారం: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో బుధవారం రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక హరిహర దివ్య క్షేత్రం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా రేవల్లి రాజుశర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం, సుదర్శన హోమం నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ నిర్వాహకుల నిర్లక్ష్యం

- నాలాల పేరుతో రోడ్లు ధ్వంసం
- ఇబ్బందుల్లో వాహనదారులు



ఎస్ఎన్‌డీపీ నాలా వల్ల బీటీ రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలు

బడంగ్‌పేట్: వరదల నుంచి కాలనీలకు విముక్తి కల్పించేందుకు శాశ్వత ప్రాతిపదికన ఎస్ఎన్‌డీపీ పథకం పేరుతో వరదనీరు కాలనీలకు చేరకుండా తీసుకున్న నిర్ణయం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గతంలో కురిసిన భారీ వర్షాలు కారణంగా వందల కాలనీలు ముంపునకు గురయ్యాయి. ఒక దశలో రెండు నెలల పాటు కాలనీలు వరదల్లో చిక్కుకుని ఇళ్లల్లో బాధితులు నిత్యావసర సరుకుల కోసం ఆర్తనాదాలు చేసిన సంగతి విధితమే. ఆ సమయంలో అప్పటి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రజల కష్టాలు చూసి శాశ్వత పరిష్కారంగా భావించి ఎస్ఎన్‌డీపీ పథకాన్ని బడంగ్‌పేట, మీర్‌పేట్ కార్పొరేషన్లకు, అలాగే జల్‌పల్లి మున్సిపాలిటీలకు తీసుకువచ్చారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌కు సుమారు రూ.58 కోట్ల ఎస్ఎన్‌డీపీ నిధులు మంజూరయ్యాయి. టెండర్లు దక్కించుకున్న గుత్తేదార్లు పనులు మొదలు పెట్టారు. అయితే, కాలనీల మీదిగా, రోడ్డు మధ్య నుంచి ఎస్ఎన్‌డీపీ నాలా వెళ్తుండటంతో కొంత ఇబ్బందిగా ఉన్న కాలనీవాసులు సహకరిస్తూ వస్తున్నారు. ఇదే అవకాశంగా భావించిన గుత్తేదార్లు సీసీ రోడ్లను, ప్రధాన బీటీ రోడ్లను తవ్వి అలాగే వదిలివేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనుల వల్ల ఉన్న బీటీ రోడ్లు, సీసీ రోడ్లు రెండుగా విడిపోయాయి. ఈ రెండింటి మధ్యన గ్యాప్ పెరగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు ఎన్‌డీపీ గుత్తేదార్లతో మాట్లాడి రోడ్లను సరిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి ధ్వంసం



సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీల కోసం పాలకుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగి రోడ్లను బాగు చేసుకున్నాం. ఎస్ఎన్‌డీపీ నాలాల పేరుతో అన్ని తొలగించారు. మూడేళ్ల క్రితం పనులు మొదలుపెట్టి ఇంకా పూర్తి చేయలేదు. ఒక దశలో అద్దుకున్నా ఫలితం లేకుండా పోయింది. కాలనీలతో పాటు ప్రధాన రోడ్లు సైతం తొలగించారు. నాలాల అభివృద్ధిని మేమే కోరుకున్నాం. అభివృద్ధి జరిగితే సంతోషం. కానీ, ఈ అలసత్వం ఏమిటీ?. ప్రభుత్వం పట్టించుకోవాలి.

– అశోక్, సాయిప్రభుహోమ్స్ కాలనీ

పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి

ఎంపీడీఓ శైలజ



పెండ్యాలలో ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ, ఏఈ రామ్‌ప్రసాద్‌రెడ్డి

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎంపీడీఓ శైలజ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని పెండ్యాల, సుభాన్‌పూర్, ఘట్టుపల్లి గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలో ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం కానుండడంతో సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రధానంగా మూత్రశాలలు, డైనింగ్ హాల్స్, వంట గదులు, ఇతర తరగతి గదులు, ప్రహరీల నిర్మాణాలను చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఏఈ, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పాఠశాలలో టేబుళ్లను మరమ్మతులు చేయించాలన్నారు. అంతకుముందు పాఠశాలలను పరిశీలించి నెలకొన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకొని పరిష్కార మార్గాలను చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీందర్‌రెడ్డి, పీఆర్‌ఏఈ రామ్ ప్రసాద్‌రెడ్డి, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న జెడ్పీటీసీ

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో రమణమోణి స్నేహ, పుల్కారపు కృష్ణయ్య ఇటీవల మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబాలను జెడ్పీటీసీ రాధాకృష్ణ, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో బాధిత కుటుంబానికి రూ.5 వేల చొప్పున, ఇరువురి కుటుంబాలకు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ యాదయ్య, సింగిల్‌విండో డైరెక్టర్‌లు వెంకటయ్య, జంగయ్య, గోపాల్ ఉన్నారు.

హైటెన్షన్ పోల్స్ ఏర్పాటుపై అభ్యంతరం



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కడ్తాల్: కడ్తాల్ గ్రామ రెవెన్యూ పరిధిలో 765కేవీ హైటెన్షన్ పోల్స్ ఏర్పాటు సర్వేకు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. మేమంతా సన్నకారు రైతులమని తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే, మా పొలాల్లో బీదర్ పవర్ గ్రిడ్ ట్రాన్స్మిషన్ లిమిటెడ్ కంపెనీ ఆథారిటీ బళ్లారి నుంచి మహేశ్వరం, మీర్‌ఖాన్‌పేట్ వరకు 765కేవీ హైటెన్షన్ పోల్స్ వేయడానికి సర్వే నిర్వహించారు. కడ్తాల్ పట్టణానికి 300 మీటర్ల దూరంలో పొలాలు ఉన్నాయని, వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న గ్రామమని, రెసిడెన్షియల్ పొలాలు, డైరీ షెడ్లు చాలా వరకు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సర్వేను నిలిపేసి వేరే రూట్లో హైటెన్షన్ పోల్స్ లైన్ వేసేలా చూడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి, న్యాయం చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు భాస్కర్‌రెడ్డి, జహంగీర్ అలీ, రాములు, లక్ష్మన్, రాజేశ్, శేఖర్‌రెడ్డి, లక్ష్మయ్య, జంగారెడ్డి, సాయికుమార్, వెంకటరమణ, యాదయ్య తదితరులు ఉన్నారు.

తాగునీటి తంటాలు!

- సక్రమంగా సరఫరా కాని మిషన్ భగీరథ నీళ్లు
- వీఆర్‌వన్ ఫిల్టర్ నీరే దిక్కు



జాపాల గ్రామంలోని వీఆర్‌వన్ ఫౌండేషన్ వాటర్ ఫిల్టర్ వద్ద నిలబడిన జనం

మంచాల: గ్రామాల్లో మిషన్‌భగీరథ నీళ్ల సక్రమంగా సరఫరా కాకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. మంచి నీటి కోసం ఫిల్టర్ వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మంచాల మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం మిషన్‌భగీరథ పథకం కింద 5080 కేఎల్ నీటిని సరఫరా చేయాలి. ప్రస్తుతం 5000 కేఎల్ నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి 400 లీటర్ల నీటిని ప్రతిరోజు సరఫరా చేయాలి. కొన్నిసార్లు 100 లీటర్లు కూడా నీళ్లు రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

తగ్గిన స్కీం బోర్లు..

ఒక్కప్పుడు గ్రామాల్లో స్కీం బోర్ల ఆధారంగా ప్రజల నీటి అవసరాలను తీర్చేవారు. మిషన్ భగీరథ పథకం రావడం, ఇంటింటికి నల్లా ఏర్పాటు చేయడంతో స్కీం బోర్లకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించడం లేదు. దీంతో వాటిని గ్రామాల్లో సక్రమంగా ఉపయోగంలోకి తీసుకొని రావడం లేదు. కొన్ని గ్రామాల్లో మాత్రమే తప్పని పరిస్థితిలో స్కీం బోర్లను నడిపిస్తున్నారు. స్కీం బోర్లు లేని గ్రామాల్లో మిషన్ భగీరథ పథకం నీళ్లు రాని రోజు ప్రజలు తాగునీటికి కష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆసరాగా వీఆర్‌వన్ ఫిల్టర్లు..

గ్రామాల్లో వీఆర్‌వన్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్లు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయి. మిషన్ భగీరథ నీళ్లు రాని రోజు ప్రజలు ఫిల్టర్ల వద్ద క్యూలో నిలబడుతున్నారు. ప్రజల దాహార్తిని ఈ ఫిల్టర్లు తీర్చుతున్నాయి. అటు స్కీం బోర్లు లేక పోవడం, ఇటు మిషన్ భగీరథ నీళ్లు రాని రోజులు ఫిల్టర్ నీళ్లే దిక్కు అవుతున్నాయి. ప్రభుత్వం ప్రజల తాగు నీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సమస్య ఉంది..



గ్రామాల్లో తాగునీరు అధికారుల లెక్కల ప్రకారం రావడంలేదు. ఇంటికి 400 లీటర్లు సరఫరా కావడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలకు సరిపడా నీటిని అందించాలి.

– నూతన గంటి శేఖర్, ఆరుట్ల

మరమ్మతులప్పుడే ఇబ్బంది..

గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా మిషన్ భగీరథ నీటిని అందిస్తున్నాం. ఎప్పుడైనా పైపు లైన్లు మరమ్మతులకు గురైయినప్పుడు మాత్రమే కొంత ఇబ్బంది కలుగుతుంది.

– అనిరుద్ధిన్‌రెడ్డి, మిషన్ భగీరథ పథకం, గ్రిడ్ అధికారి

కిక్‌బాక్సింగ్‌లో మూడు రజితాలు



విద్యార్థిని అభినందిస్తున్న కేఎల్‌ఆర్ తదితరులు

కందుకూరు: జాతీయ స్థాయి చిల్డ్రన్ క్యాడేట్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండల పరిధిలోని సాయిరెడ్డిగూడకు చెందిన 7వ తరగతి విద్యార్థి ఊటు ప్రేమ్‌కుమార్ మూడు రజిత పథకాలను సాధించాడు. ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు మహారాష్ట్ర పూణేలో నిర్వహించిన అండర్-14 విభాగంలో పాయింట్ ఫైట్, లైట్ కాంటాక్ట్, గ్రూప్ ఫైట్ పోటీల్లో పాల్గొని రజిత పథకాలను అందుకున్నాడు. బుధవారం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థి ప్రేమ్‌కుమార్, కోచ్ మల్లేశ్‌తో కలిసి మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌ను కలిశారు. విద్యార్థిని ఆయన అభినందించారు. రూ.20 వేల నగదు పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సరికొండ పాండు, కాంగ్రెస్ కందుకూరు గ్రామశాఖ అధ్యక్షుడు గాదె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, తదితరులు

తుక్కుగూడ: మున్సిపాలిటీలో కొత్తగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను ఎమ్మెల్యే పి.సబితారెడ్డి బుధవారం పరిశీలించారు. మార్కెట్ నిర్మాస్తున్న కాంట్రాక్టర్‌కు రావాల్సిన పెండింగ్ బిల్లులు తొందరగా వచ్చేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు ఎన్నికల కోడ్ అయిపోయిన వెంటనే తొందరగా పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలని ఆమె కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ బి.రవినాయక్, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జే.లక్ష్మయ్య యాదవ్, మాజీ సర్పంచ్ నర్సింహరెడ్డి, నాయకులు సురేశ్, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్ రెడ్డి, శ్రీలత, యాదగిరి, సింహారెడ్డి పలువురు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం బృందం

సీపీఎం మండల కార్యవర్గ సభ్యుడు జగన్

ఇబ్రహీంపట్నం రూరల్: గుంతలమయంగా మారిన పోల్కంపల్లి –రాయపోల్ రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం పార్టీ ఇబ్రహీంపట్నం మండల కార్యవర్గ సభ్యుడు జగన్ డిమాండ్ చేశారు. బుధవారం ధ్వంసమై కంకర తేలిన రోడ్డును సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ఏళ్ల తరబడిగా ధ్వంసమైన రోడ్డును కనీసం పట్టించుకోవడం లేదన్నారు. మూలమలుపులతో రోడ్డు ప్రమాదకరంగా మారిందన్నారు. ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి దాపరించిందని వాపోయారు. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా ధ్వంసయిందని చెప్పారు. పలుమార్లు ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. ప్రమాదకరంగా మారిన రోడ్డును బాగు చేయించి, రోడ్డు విస్తరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయపోల్ మాజీ ఎంపీటీసీ నీరుడు భిక్షపతి, సీపీఎం నాయకులు పల్లపు రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



యాచారం: రైతులకు అవగాహన కల్పిస్తున్న గీతారెడ్డి

యాచారం: నకిలీ విత్తనాలు విక్రయిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి హెచ్చరించారు. మండలంలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలో బుధవారం విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే స్థానిక వ్యవసాయాధికారులకు రైతులు సమాచారం ఇవ్వాలని అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఆ దుకాణానికి ప్రభుత్వ లైసెన్స్ ఉందా.. లేదా అని నిర్ధారించుకోవాలని సూచించారు. అలాగే, రసీదును కచ్చితంగా తీసుకోవాలని, పంట చేతికొచ్చే వరకు వాటిని జాగ్రత్తగా భద్రపర్చుకోవాలన్నారు. రైతులు తక్కువ ధరల ఆశతో జిల్లాలో పలుచోట్ల నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి, పంట సాగు చేస్తే పూత, కాత లేక నష్టపోయిన దాఖలాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. పత్తి విత్తనాలను పక్క రాష్ట్రాలు, జిల్లాల నుంచి తీసుకొచ్చి విక్రయాలు జరిపే వారిపై నిఘా ఉంచాలని మండల వ్యవసాయాధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏఓ సందీప్ కుమార్, మాజీ సర్పంచ్ సురేందర్‌రెడ్డి, నాయకుడు సురేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రసీదు తప్పనిసరి

కడ్తాల్: రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు ఆయా దుకాణాల నుంచి రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చల్లంపల్లి, వాస్‌దేవ్‌పూర్, న్యామతాపూర్, మర్రిపల్లి తదితర గ్రామాల్లో విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, వారి నుంచి తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. విత్తన ప్యాకెట్, రసీదు బిల్లులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు వందన, రమణ అభినవ్‌రెడ్డి, కేదార్‌సింగ్ రైతులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం : ఏఓ రాజు

తలకొండపల్లి: నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి రాజు హెచ్చరించారు. బుధవారం మండలంలోని పడకల్‌లో ఓం సాయి ట్రేడర్స్, శివ ట్రేడర్స్, వెంకటేశ్వర ట్రేడర్స్, తదితర ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్ దుకాణాలను ఏఓ తనిఖీ చేశారు. ఆయా షాపుల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందు స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని చెప్పారు. అలాగే, మండలంలోని చీపునుంతల, తలకొండపల్లి, చౌదర్‌పల్లి, ఆర్లకుంట తండా, జూలపల్లి, తదితర గ్రామాల్లో ఏఈఓలు విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేసవి దుక్కులు వల్ల కలిగే ప్రయోజనాలు, పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు విజయ్, శ్రీనాథ్, శిరిష, శ్రీకాంత్, అనిత, డీలర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన

మాడ్గుల: మండల పరిధిలోని కలకొండ రామదుగ్యాల, గిరికొత్తపల్లి, గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయ విస్తరణ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈఓ వాహిని, జోస్నా రాధమ్మ, రాజేష్ నాయక్, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

అబ్దుల్లాపూర్‌మెట్ : రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం డివిజన్ వ్యవసాయ శాఖ సంచాలకుడు వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలకు చెందిన రాష్ట్ర విత్తన లైసెన్స్, జిల్లా విత్తన లైసెన్స్ ఉన్న డీలర్లకు ప్రాసెసింగ్ కంపెనీలకు బుధవారం విత్తనాల అమ్మకాలు–చట్టాలు– ఇతర జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందించాలని, కల్తీ విత్తనాలు, విడి విత్తనాలు, కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సీడ్స్ యాక్ట్ ప్రకారం ప్రతి విత్తన డీలర్లకు లైసెన్స్ మొదలుకుని స్టాక్‌బోర్డు, స్టాక్ రిజిస్టర్, డెలివరీ చలానాలు, రసీదులు తప్పనిసరిగా ఉండాలన్నారు. వ్యవసాయశాఖ, పోలీసుశాఖలు సంయుక్తంగా నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా చర్యలు చేపడుతున్నామని, ఎవరైనా లైసెన్స్ లేకుండా విత్తనాలు, సరఫరా చేసినా, విక్రయించినా, స్టాక్‌బోర్డు, రిజిస్టర్ నమోదు చేయకపోయినా సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు కవిత, సోల్మన్‌నాయక్, ఎస్‌ఐ రమేష్‌నాయక్, అధికారులు రాధికారాణి, డీలర్లు పాల్గొన్నారు.



కడ్తాల్: అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల తనిఖీ

ఆమనగల్లు: రైతులు విత్తనాలు, ఎరువులకు కొనుగోలు చేసిన తర్వాత విధిగా రసీదులు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అరుణ కుమారి సూచించారు. మండలంలోని పోలెపల్లి, నుచ్చుగుట్ట, జంగారెడ్డిపల్లి, శెట్టిపల్లి, రాంనుంతల గ్రామాల్లో బుధవారం వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విత్తనాల ఎంపిక, వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం తదితర విషయాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణంలోని తిరుమల ఫర్టిలైజర్స్, సూర్య ఆగ్రి కెమికల్స్, లక్ష్మీవేంకటేశ్వర ఆగ్రిషాప్, ధనలక్ష్మి ట్రేడర్స్‌లను అరుణ కుమారి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీలర్లు సురేశ్, భరత్‌రెడ్డి, మధుసూదన్, రాజు తదితరులు పాల్గొన్నారు.